తెలుగు డిజిటల్ దినపత్రిక
సిరి
...People Voice | www.siridaily.com
శనివారం, అక్టోబర్ 11, 2025 | సంపుటి-1 సంచిక-299 పేజీలు-10
The Largest Readers Local Digital Daily

# మోసాలను ఎండగడుతాం

- కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గడపకూ తీసుకెళ్లాం
- హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి
- మెదక్ లో బాకీకార్డుల ఆవిష్కరణ

6




# సైబర్ వల.. చిక్కితే విలవిల







- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకొని చీటింగ్
- ఖాతాల నుంచి క్షణాల్లో మాయవుతున్న డబ్బులు
- మరోవైపు లోన్ యాప్‌ల వేధింపులు
- బలవుతున్న సామాన్యులు, అమాయకులు
- అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు

ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేశారు. అపరిచిత కాల్స్‌కు స్పందించినా, లింక్స్ క్లిక్ చేసినా మనం వారి ఉచ్చులో పడ్డట్టే. సైబర్ మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి.

-సంగారెడ్డి, సిరి న్యూస్

వివరాలు 3లో

## భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

- 5000 రూపాయల జరిమానా
- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఐపీఎస్

2






## అందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

7

- లీగల్ ఎయిడ్ క్లినిక్స్ ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర
- సంగారెడ్డిలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

## ఏటీసీలో శిక్షణతో బంగారు భవిష్యత్తు

- పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

5




# ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి

▪ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రావు




**మెదక్ రూరల్ అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు 42% పిట్ మెంట్ తో పి.ఆర్.సి ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ యూనియన్ అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఏడుపాయల హరిత హోటల్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఏ. సత్యానారాయణ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ కార్యవర్గం, తెలంగాణ (33) జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు సచివాలయం, హైదరాబాద్ సిటీ అధ్యక్ష కార్యదర్శులతో పాటు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (106) శాఖల ఫోరమ్స్ అధ్యక్ష కార్యదర్శులు మహిళా విభాగం కార్యవర్గం పాల్గొన్నారు. పలు ముఖ్యమైన విషయాలపై విస్తృత మైన చర్చ అనంతరం ఈ క్రింది తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించారు. 1. 01-07-2023 . పే రివిజన్ కమిషన్ రిపోర్ట్ 2 వెంటనే తెప్పించుకొని ఉద్యోగులకు 42% పిట్ మెంట్ ను ఇచ్చి తెలంగాణ రెండవ పి.ఆర్.సి. పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని తీర్మానించనైనది. 2.1 (5) 4. 2 (01-07-2023, 01-01-2024, 01-07-2024, 01-2025, 01-07-2025)




పెండింగ్ ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని తీర్మానించనైనది. 3. ప్రభుత్వం ప్రకటించిన మేరకు; ప్రభుత్వం మరియు ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ సమాన నిష్పత్తి లో చేసి ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈ హెచ్.ఎస్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ విధి విధానాలను ను వెంటనే అమలు పరచాలి..రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ సి.పి. ఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ స్కీమ్ ఓ పిఎస్ ను పునరుద్ధరణ చేయాలని తీర్మానించనైనది!

ఉద్యోగ గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మికుల, పెన్సనర్స్ (64) సమస్యల పై సానుకూలంగా స్పందించి (25 డిమాండ్లను కొంత మేరకు పరిష్కరించినందున) రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించనైనది.ఇంకను కొన్ని శాఖలలో పెండింగ్ లో ఉన్న అద్దె వాహనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలి; అద్దె వాహనాలకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.34 వేలను 2012లో నిర్ధారించిన విధంగా ఇప్పటికి చెల్లిస్తున్నారు. డీజిల్ ధరలు రెట్టింపు అయినందున కనీసం రూ.50 వేలకు పెంచాలని తీర్మానించనైనది జిల్లాల శాఖలు ఫోరమ్స్ ల ఆఫీసు భవనాలకు సంబంధించి ల్యాండ్ అలాట్ మెంట్ నిర్మాణం తదితర విషయాలపై సత్వరం ప్రాసెస్ చేయవలసిందిగా ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. 2025 సభ్యత్వ నమోదు కార్యక్రమం డిసెంబర్ లోపుగా పూర్తి స్థాయిలో చేయవలెనని ఏకగ్రీవంగా తీర్మానించారు. సెంట్రల్ అసోసియేషన్ కు సంబంధించిన ఈరోజు వరకు జరిగిన ఆర్టిక ఆర్థిక లావాదేవీలు, జమ, ఖర్చులు బ్యాంక్ స్టేట్ మెంట్ ఆధారంగా ఈ రోజు వరకు నిశితంగా పరిశీలించి,చదివి వినిపించినందున అన్నింటిని ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. పైతీర్మానాలను రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈకార్యవర్గ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షులు: బి.శ్యామ్, కోశాధికారి, ఎం.ఉపేందర్ రెడ్డి , ఉపాధ్యక్షులు ఏ,జగన్మోహన్ రావు, ఎస్. సహదేవ్,ఎం. రామకృష్ణ గౌడ్,ఎస్.నరహరి రావు, ప్రొ.జి.మల్లేశం, సెక్రటరీస్: ఏ పరమేశ్వర్ రెడ్డి 2 శ్రీమతి శిరీష,కె. శ్రీనివాస్ రెడ్డి, డా.టి.హరికృష్ణ, పి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్: కె. కిరణ్ కుమార్, వి. సురేశ్,పబ్లిసిటీ సెక్రెటరీస్: అస్నాల శ్రీనివాస్, సంతోష్ కుమార్, ఆఫీస్ సెక్రెటరీస్ : ఆర్, శ్రీనివాస్ మూర్తి, టి.వి. ప్రసాద్, శ్రీమతి, కిరణ్మయి, కల్చరల్ సెక్రెటరీస్: ఆర్. కోటాజీ, రాజేష్ కుమార్, స్పోర్ట్స్ & గేమ్స్ సెక్రెటరీస్ : బట్టు గోపి, గంప శ్రీనివాస్, కార్యనిర్వాహక సభ్యులు: పి.యాదగిరి, శ్రీమతి. పూనమ్, శ్రీమతి నవీన్ జ్యోతి, మొహమ్మద్ మోహియుద్దీన్, బక్క శ్రీనివాస్, టి. లక్ష్మణ్ గౌడ్, మహిళా చైర్మన్: డా. జి. దీపారెడ్డి కన్వీనర్: శ్రీమతి, జె. సుజాత, కోశాధికారి: శ్రీమతి, శాంతి శ్రీ. మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఏ. విఠల్, సి. హెచ్, నాగభూషణం మరియు 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు డిపార్ట్మెంట్ ఫోరమ్స్ అధ్యక్ష కార్యదర్శులు మరియు మహిళా విభాగాల కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# భర్త హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు

- **5000 రూపాయల జరిమానా**
- **జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఐపీఎస్**



**మెదక్ రూరల్ అక్టోబర్ 10, (సిరి న్యూస్) :** హవెలి ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శమ్నపూర్ గ్రామానికి చెందిన సంగపోల్లా మలయ్య (వయస్సు 50 సంవత్సరాలు) మూడు సంవత్సరాలు దుబాయ్‌లో పనిచేసి, సంవత్సరం క్రితం తిరిగి గ్రామానికి వచ్చి వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మలయ్య భార్య సంగపోల్లా లక్ష్మికి గ్రామానికి చెందిన జాల రాందాస్‌తో అక్రమ సంబంధం ఉండడంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ విషయం పై గ్రామ పెద్దలు పలుమార్లు పంచాయతీలు నిర్వహించి వారిని హెచ్చరించినా పరిస్థితి సద్దుమణగలేదు. 24.02.2020 రాత్రి సుమారు 12:00 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య మళ్లీ తగవు జరిగి, మలయ్య తమ్ముడు నర్సింలు వచ్చి సర్ది చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. తరువాత రోజు 25.02.2020 ఉదయం మలయ్య మృతదేహం ఇంట్లో కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మలయ్య మృతి విషయంలో, నర్సింలు తన వదిన లక్ష్మి మరియు ఆమెకు అక్రమ సంబంధం ఉన్న జాల రాందాస్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, హవెలి ఘనపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మెదక్ రూరల్ సీఐ పి. రాజశేఖర్ గారు సమగ్ర విచారణ జరిపి, సాక్ష్యాధారాలను సేకరించి నిందితులపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ మెదక్ రూరల్ సీఐ జర్జ్ , సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. వెంకటేష్ ,తన వాదనలను వినిపించారు.లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, సీడీఓలు రవీందర్ గౌడ్, యండి గౌస్ విచారణలో సహకరించారు.పూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన గౌరవ జిల్లా న్యాయమూర్తి శ్రీమతి నీలిమ నిందితురాలిని దోషిగా తేల్చి జీవిత ఖైదు, రూ.5,000/-జరిమానా విధించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి న్యాయం జరిగేలా కృషి చేసిన హవెలి ఘనపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు ను కోర్టు సిబ్బందిని అభినందించారు.

# నేడు రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- **ఏడీఈ మోహన్ బాబు**



**మెదక్ రూరల్ అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** నేడు,రేపు మెదక్ పట్టణం,మెదక్,హవేళీ ఘనపూర్ ,చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ట్రీ కటింగ్, కరెంట్ తీగల మార్పులు పట్టణ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు చర్యలు మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్ బాబు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత నాణ్యమైన, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు,ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్,కరెంట్ తీగల మార్పులతో పాటు ట్రీ కటింగ్ తదితర పనులు చేపట్టనున్న దృష్ట్యా జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంతో పాటు మెదక్, హవేళీ ఘనపూర్, చిన్నశంకరంపేట,పాపన్నపేట మండలాల్లో శనివారం, ఆదివారం (ఈనెల 11, 12వ తేదీల్లో) రెండు రోజుల పాటు ఉదయం 09.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ విద్యుత్తు శాఖ ఏడీఈ మోహన్‌బాబు,మెదక్ పట్టణ, హవేళీ ఘనపూర్ మండల ఏఈ నవీన్, మెదక్, చిన్నశంకరంపేట, పాపన్నపేట మండలాల ఏఈలు రాజ్‌కుమార్, దినకర్, నర్సింలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఆయా మండలాల్లోని సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్, ట్రీ కటింగ్‌తో పాటు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్, కరెంట్ తీగలను మార్చాల్సిన అవసరం ఉన్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ మోహన్ బాబు, ఏఈలు పేర్కొన్నారు. మెదక్ పట్టణ ప్రజలు, రైతులు తమకు సహకరించాలని ఏడీఈ మోహన్ బాబు,ఏఈలు నవీన్,రాజ్‌కుమార్,దినకర్, నర్సింలు కోరారు.




# సైబర్ వల.. చిక్కితే విలవిల

- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకొని చీటింగ్
- ఖాతాల నుంచి క్షణాల్లో మాయవుతున్న డబ్బులు
- మరోవైపు లోన్ యాప్‌ల వేధింపులు
- బలవుతున్న సామాన్యులు, అమాయకులు
- అప్రమత్తతే ఆయుధమంటున్న పోలీసులు

**ఆన్‌లైన్, సాంకేతికతను ఆధారంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు పెట్రేగిపోతున్నారు. అమాయకులు, మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారిని, డబ్బు అత్యవసరం ఉన్న వారిని టార్గెట్‌గా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. కేవలం నిరక్ష్యరాస్యులే కాదు విద్యావంతులు సైతం ఈ మోసాలకు బలవుతున్నారు. ఇటీవల ఈ సైబర్ మోసాల బారినపడ్డ చాలామంది పోలీస్‌స్టేషన్లలో కేసులు కూడా నమోదు చేశారు. అపరిచిత కాల్స్‌కు స్పందించినా, లింక్స్ క్లిక్ చేసినా మనం వారి ఉచ్చులో పడ్డట్టే. సైబర్ మోసాలు రకరకాలుగా జరుగుతున్నాయి. వయస్సు, వ్యక్తుల విధులను బట్టి కూడా నేరాలు జరుగుతున్నాయి.**

**- సిరి న్యూస్, 10 అక్టోబర్**

ఒకరు ఫోన్ చేసి ఆధార్ అప్‌డేట్ చేయాలి లింక్ పంపిస్తున్నాం అంటూ మన ఖజానా ఖాళీ చేస్తారు. మరొకరు వీడియోకాల్ చేసి అమ్మాయిలతో మాట్లాడించి రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజుతారు. ఇంకొకరు ఓటీపీ అడిగి ముంచుతారు. ఇలాంటి సైబర్ మోసాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఈ నేరాలకు సంబంధించి కొన్ని మాత్రమే పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. మిగతా వారు పరువు పోతుందనో, చుట్టు పక్కల వారికి చులకన అవుతామనే ఉద్దేశంతో మోసపోయామని తెలిసినా ఎవరి చెప్పకుండా లోలోపల మదనపడే వారు కోకొల్లలు. ఇటీవల లోన్‌యాప్ వేధింపులు మరీ ఎక్కువయ్యాయి. పొరపాటున ప్రైవేటు యాప్ నుంచి అప్పు తీసుకుంటే మన జీవితం గుల్ల అయినట్టే. వడ్డీకి వడ్డీ కట్టి అసలు చెల్లించినా ఇంకా కట్టాలంటే లోన్ యాప్ వారు వేధిస్తుంటారు. మరోవైపు మన కాల్ లిస్ట్‌లో ఉన్న వారందరికీ ఫోన్ చేసి మన గురించి చెప్పి పరువు తీస్తుంటారు. ఇలా వేధింపులకు గురిచేస్తారు. ఈ బాధలను తట్టుకోలేక పరువు పోయిందనే మనస్తాపంతోనే చాలామంది ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఇటీవల పెరిగిపోయాయి.

### లింక్ క్లిక్.. లక్ష డ్రా

వెంకటేశ్ (పేరు మార్చాం) ఒక వ్యాపారవేత్త. పెట్రోల్‌బంక్ నిర్వహణతోపాటు ఇతర వ్యాపారాలు ఉన్నాయి. తెలివైన, చురుకైన వ్యాపారిగా ఆయనకు గుర్తింపు ఉంది. కొద్దో గొప్పో రాజకీయ పరిచయాలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం వెంకటేశ్ సెల్‌ఫోన్‌కు ఒక లింక్ వచ్చింది. మీ ఆధార్‌కార్డు ఖాతాతో లింకు కాలేదంటూ మెసేజ్ రావడంతోపాటు, లింక్‌ను క్లిక్ చేస్తే సరిపోతుందని మెసేజ్‌లో పేర్కొన్నారు. మెసేజ్‌ను చూసి వెంకటేశ్ లింక్‌ను క్లిక్ చేయగానే, అకౌంట్‌లో ఉన్న దాదాపు లక్ష రూపాయలు డ్రా అయిపోయాయి. ఈ విషయాన్ని రెండు రోజుల తర్వాత తెలుసుకున్న వెంకటేశ్, పోలీసులను ఆశ్రయించాడు.

### అత్యాశకు పోతే అంతే సంగతి..

నిరక్షరాస్యులే కాదు, విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. బ్యాంకు వాళ్లమని, ఓటీపీ చెప్పాలని, లాటరీ వచ్చిందని ఎర వేసి ఖాతాల్లోంచి డబ్బులు లాక్కెళ్తున్నారు. లింకులు పంపడం, పెట్టుబడి పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ డబ్బులు వస్తాయని సైబర్ క్రిమినల్స్ ప్రకటనలను చూసి చదువుకున్న వారు సైతం అత్యాశకు పోయి మోసపోతున్నారు. సైబర్ క్రిమినల్స్‌ను పట్టుకోవడం క్లిష్టమైన ప్రక్రియ. ప్రజలు మోసపోకుండా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

### అప్రమత్తతే రక్షణ

- డెబిట్, క్రెడిట్ కార్డ్స్, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, సీవీవీ నంబర్లను ఏ బ్యాంక్ అధికారి అడగరు. వినియోగదారులు గమనించాలి. బ్యాంకు అధికారులమంటూ వచ్చే ఫోన్ కాల్స్‌కు సమాధానం ఇవ్వకపోవడమే మంచిది.
- అపరిచితుల నుంచి వచ్చే ఆఫర్లు, లాటరీలు, డిస్కౌంట్లను నమ్మవద్దు. ఎవరూ ఊరికే మనకూ బహుమతులు ఇవ్వరు. డబ్బులు పంపరు.
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికగా కొన్ని డేటింగ్ యాప్‌ల ద్వారా అందమైన అమ్మాయిలు, మహిళల ఫొటోలతో అకౌంట్లు తెరిచి ఫ్రెండ్ రిక్వెస్టులు, ఫొటోలు పంపుతారు. న్యూడ్ కాల్స్ చేసి వలలో వేసుకుంటారు. అంతా రికార్డు చేసి వేధిస్తారు. బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు గుంజుతారు. ఇలాంటి వాటి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.
- ఒక్క క్లిక్‌తో లోన్ ఇస్తామని నమ్మిస్తూ పలు యాప్‌లు లోన్లు ఇస్తాయి. లోన్ మొత్తానికి అధికంగా కట్టినా.. ఇంకా కట్టాల్సి ఉందని వేధిస్తాయి. ఇలా వేధింపులతో ఎంతో మంది ప్రాణాలు తీసుకున్నారు. అందుకే లోన్ యాప్‌లకు దూరంగ ఉండాలి.
- అనుమానాస్పదంగా ఉండే లింక్‌లు ఓపెన్ చేయకపోవడమే మంచిది.
- చెక్‌బుక్, కేవైసీ పత్రాల కాపీలను అపరిచితులతో పంచుకోవద్దు.







# ఘనంగా పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ఊరేగింపు


**గుమ్మడిదల రూరల్ , అక్టోబర్ 10 ( సిరి న్యూస్) :** గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఆలయ ప్రారంభోత్సవం ఉత్సవాలు మూడు రోజులుగా నిర్వహించనున్నారు. శుక్రవారం నూతన విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా అమ్మవారి విగ్రహాలను భాజా భజంత్రీలు మహిళల కోలాటం నడుమ ఊరేగింపుగా నిర్వహించారు. ఊరేగింపులో దేవతామూర్తులకు ఇంటింటా మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు శనివారం జరగనున్న దేవత పూజ అవాహిత దేవత హోమం ఆదివారం జరగనున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరగనున్న భజన కార్యక్రమాలు మంగళవారం జరగనున్న పోచమ్మ తల్లికి బండ్లు బోనాలతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానికులు తెలిపారు మంబాపూర్ గ్రామం కోలాహలంగా మారింది. ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకొని



గ్రామంలో రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రోడ్లన్నీ దీపాల వెలుగులతో విరాజిల్లుతుంది ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## మినీ ఇండియాలో భక్తిశ్రద్ధలతో ఉత్తరాది రాష్ట్రాల పూజలు




**మనోహరాబాద్, అక్టోబర్ 10. సిరి న్యూస్) :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాలకల్ గ్రామం మినీ ఇండియాగా మారింది. ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఉండడం వల్ల వేలాదిమంది ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఉత్తర ప్రదేశ్, బీహార్ పలు రాష్ట్రాల ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఆ రాష్ట్రాల వారి పెద్ద పండుగ అయిన కర్వాచేత్ అనే పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంట్లో మహిళలు నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేకంగా దేవతామూర్తులను ప్రతిష్టించి మండపాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అలాగే దేవతామర్తుల చిత్రపటాల ముందు కొత్త బట్టలను, వివిధ రకాలుగా తయారు చేసిన పిండి వంటలను, పంటను చిత్రపటాల ముందు ఉంచి పూజ నిర్వహించారు. ఉదయం నుండి రాత్రి వరకు ఉపవాస దీక్షలు చేపట్టి ఆకాశంలో చంద్రుని చూసి దీక్షలు విరమించారు. మహిళలు తమ భర్తలు ఆయురారోగ్యాలతో ఉండాలని భావనతోనే ఈ పూజ నిర్వహిస్తున్నట్లు మహిళలు తెలిపారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేత

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్):** సంగారెడ్డి జిల్లా పరిధిలోని మునిపల్లి, కోహిర్, ఝురాసంఘం, జహీరాబాద్, మొగుడంపల్లి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ, పటాన్‌చెరు మండలాల ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే రక్షిత మంచి నీటిని మరమ్మత్తుల కారణంగా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈ ఈ విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగూరు ఆనకట్ట వద్ద ఉన్న బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కర్మాగారంలో అత్యవసర మరమ్మత్తు పనులు జరుగుతున్నందున, శనివారం (11 అక్టోబర్) మధ్యాహ్నం 12 గంటల నుండి ఆదివారం (12 అక్టోబర్) సాయంత్రం 8 గంటల వరకు రెండు రోజులపాటు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. అందువల్లన సంబంధిత మండలాల ప్రజలందరూ వారి అవసరాలకు సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలన్నారు. ఆయా మండలాల ప్రజలు మిషన్ భగీరథ సిబ్బందికి సహకరించవలసిందిగా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ.ఈ విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్ ను పరామర్శించిన పద్మ దేవేందర్ రెడ్డి





మెదక్ ప్రతినిధి: (సిరి న్యూస్) : రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ మాజీ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల. విజ్జయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం. పద్మాదేవేందర్ రెడ్డి శుక్రవారం సిద్దిపేట జిల్లా,చిన్న కోడూరు మండలంలోని గంగాపూర్ గ్రామానికి చేరుకుని ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల.విజ్జయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం ఎర్రోళ్ల. శ్రీనివాస్ ను,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల. విజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. వీరితోపాటు జనగామ ఎమ్మెల్యే పల్లె రాజేశ్వర్ రెడ్డి,రాష్ట్ర బేవరేజెస్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి. సునీత, రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం, నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీల పోరం మాజీ అధ్యక్షులు బాల్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# నియోజకవర్గానికి సమస్యను తీర్చాలి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం అందజేసిన రాజిరెడ్డి

**నర్సాపూర్ అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సింగూరు నీటిని దిగువకు విడుదల చేయడంతో మంజీరా నది తీరంలో ఉన్న ప్రధాన పైప్ లైన్ లీకేజీ కారణంగా మిషన్ భగీరథ ద్వారా నర్సాపూర్ నియోజకవర్గానికి తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో, నర్సాపూర్ నియోజకవర్గ, పట్టణ ప్రజలు కొంత కాలంగా త్రాగునీటి సమస్య ఏర్పడింది ఈ సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి గోదావరి జలాలను కోమటిబండకు ప్రత్యేక పైప్ లైన్ ద్వారా శివ్వంపేట పంపుకు మళ్లించి నియోజకవర్గానికి తక్షణమే నీటి సరఫరా చేయించాలని మంత్రిని ఆవుల రాజిరెడ్డి కోరారు.మంత్రి వెంటనే స్పందించి, మూడు నుండి నాలుగు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని ఇంజనీర్-ఇన్-చీఫ్ (ENC) కృపాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.ఈ నిర్ణయంతో నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు నీటి సమస్య ఉండకపోవచ్చు అని ఆవుల రాజిరెడ్డి తెలిపారు.





గత నాలుగు సంవత్సరాల క్రితం చందాపూర్ గ్రామానికి చెందిన సాయి ప్రసాద్ అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేసుకునేవాడు డ్యూటీ కి వెళ్తుండగా మిషన్ కాకతీయ పనులలో భాగంగా కాలువ లో పడి వెన్నుపూస విరిగి అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్న విషయం సానీక్ష ఫౌండేషన్ శివ ఆధ్వర్యంలో ఎన్.ఎఫ్.డబ్ల్యూ ఎన్.జి.ఓ వెంకటమురళి మరియు రోటరీ క్లబ్ కాచిగూడ వారి సహకారం తొ వీల్ చెర్ వాటర్ బెడ్ అందించారు.ఇదివరకు వాటర్ బెడ్ ని కూడా అందించారు అలానే వారికి కావాల్సిన సహకారాలు అందివ్వడానికి మా వంతు కృషి చేస్తాము అని డా. శివ తెలియజేశారు.ఈ కార్యక్రమం లొ సానీక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివ,గాంధీ హాస్పిటల్ వైద్య విద్యార్థులు సానీక్ష ఫౌండేషన్ సభ్యులు రాందాస్, కృష్ణ, శ్రీకాంత్,రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

# ఏటీసీలో శిక్షణతో బంగారు భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ ప్రతినిధి (సిరి న్యూస్) :** ఏటీసీలో శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట పడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారంమెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండలం కేంద్రంలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ కేంద్రాన్ని అయన పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఏటిసి సెంటర్ మొత్తం కలియ తిరిగి సౌకర్యాలను జరుగుతున్న వివిధ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో ఉన్న అధునాతన మిషనరీ గురించి వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీ శిక్షణ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.ఈ సందర్శనలో కలెక్టర్ వెంట ఏటిసీ సెంటర్ నిర్వాహకులు. సిబ్బంది పాల్గొన్నారు.



# ఉరి వేసుకుని యువకుడు ఆత్మ హత్య



**మెదక్ రూరల్ అక్టోబర్ 10, (సిరి న్యూస్) :** ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...తండాకు చెందిన కేతావత్ విజయ్ కుమార్(32) మార్కెటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.కాగా గత రెండు రోజులుగా దిగులుగా ఉంటున్నాడు.పని నిమిత్తం గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు పలుమార్లు ఫోన్ చేసిన స్పందించ లేదు.దీంతో చుట్టూ పక్కల వెతికారు.శుక్రవారం ఉదయం వెతుకుతుండగా తండా సమీపంలో అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తండ్రి రామ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



- కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతి గడపకూ తీసుకెళ్లాం
- హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి
- మెదక్ లో బాకీకార్డుల ఆవిష్కరణ

# మోసాలను ఎండగడుతాం

**మెదక్ ప్రతినిధి: (సిరి న్యూస్) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ను ఎండగడుదామని, ఆ పార్టీ బాకీ కార్డు లను ప్రతి గడపకూ తీసుకెళ్లి అవగాహన కల్పిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి లు పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం (తెలంగాణ భవన్)లో గురువారం మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను బిఆర్ఎస్ శ్రేణులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి లు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల వుతున్నా ఏ ఒక్క హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలకూ బాకీ పడింద న్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ బాకీ కార్డు పేరిట ఉద్యమాన్ని చేపట్టారని. 'కాంగ్రెస్ బాకీ కార్డు'లను ఇంటింటికీ చేరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ పార్టీ మోసాలను ఎండగడుతూనే, కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన ఆ పార్టీ నాయకులను నిలదీసేలా ప్రజల్లో చైతన్యం తేవాలని కోరారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా కాంగ్రెస్కు ఓటేసే పరిస్థితి లేదన్నారు. ఈ ప్రభుత్వం ఆ పార్టీలో ఉన్నోళ్ల కోసమే పని చేస్తున్నదని. ప్రజల సమ స్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇంది రమ్మ ఇండ్లు కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారని, పేదోళ్లను విస్మరించారని విమర్శించారు. అనేక మంది అప్పులు చేసి ఇండ్లు కట్టుకుంటున్నారని, కానీ, బిల్లులు ఇవ్వడం రావడం లేదని, అసలు వస్తాయో రావో తెలియని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పు రూ 2 లక్షల కోట్లు మాత్రమేనని, కానీ, కాంగ్రెస్ 22 నెలల పాలనలో 1.60 లక్షల కోట్లు అప్ప చేసిందని విమర్శిం చారు. పదేళ్లలో చేసిన అప్పులతో కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు తెలంగాణ చివరి స్థానానికి పడి పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పు చేసి అభివృద్ధి చేసిందని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచిందని చెప్పారు. ఆ అభివృద్ధి, సంక్షేమం ప్రతి చోటా కనిపిస్తున్నదని, మనం ఈ గులాబీ కండువా కప్పుకొని ఎక్కడికి వెళ్లినా మనల్ని గౌరవించే పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే ప్రజల్లో ఎవరిపై మంచి అభిప్రాయం ఉందో తెలుసుకొని టికెట్లు ఖరారు చేసుకుందామని, వారినే గెలి పించుకుందామని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు జయరాజ్,ఆర్ కె శ్రీనివాస్, విశ్వం, మాయ. మల్లేశం, కో కన్వీనర్లు గడ్డమీద కృష్ణ గౌడ్ లింగారెడ్డి, మెదక్ హవేలీ ఘన్పూర్ మండల పార్టీ అధ్యక్షులు ఎం అంజ గౌడ్,సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులు, నాయకులు ప్రభు రెడ్డి, కిష్టయ్య, ఎలక్షన్ రెడ్డి,ఇస్మాయిల్, బట్టి. ఉదయ్, సాంబశివరావు, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి నారాయణ, ప్రభాకర్ రాములు, బాలయ్య, మోహన్, మండల నాయకులు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.




# కాలకల్ గుంతల రోడ్డును పరిశీలించిన డీపీవో

- పంచాయతీ నీళ్లతో రోడ్డును మరమ్మతులు చేస్తాం

**మనోహరాబాద్, అక్టోబర్ 10. సిరి న్యూస్) :** మండలంలోని కాళ్లకల్ గ్రామ ఊర చెరువు నుండి పారిశ్రామిక ప్రాంతమైన ముప్పిరెడ్డిపల్లి నాలుగు రోడ్ల చౌరస్తా వరకు ఉన్న రోడ్డు గుంతలమయంతో దుబ్బరంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు వీరబోయిన నరేష్ ముదిరాజ్, ఆటో యూనియన్ అధ్యక్షుడు గులాం లతో పాటు పలువురు నాయకులు గత నాలుగు రోజుల క్రితం మనోహరాబాద్ వచ్చిన మైనంపల్లి హనుమంతరావుకు విజ్ఞప్తి పత్రం అందజేశారు. ఆయన స్పందించి ఫోన్ ద్వారా డిపిఓ యాదయ్యకు పరిస్థితి వివరించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం డిపిఓ యాదయ్య రోడ్డును పరిశీలించారు. ముప్పిరెడ్డిపల్లి నాలుగు రోడ్ల చౌరస్తా నుండి కొంత దూరం వరకు టి జి ఐ ఐ ఐ సి పరిధిలో ఉన్నందున వారికి లెటర్ పెట్టి పరిస్థితి వివరిస్తామన్నారు. ఇక్కడి నుండి ఉర చెరువు వరకు రోడ్డు నిర్మాణం చేపడతామని ఆయన తెలిపారు. ప్రస్తుతం పంచాయతీ నిధులతో గుంతల మయంగా ఉన్న రోడ్డును బాగు చేస్తామని తెలిపారు. ఈ రోడ్డును మరమ్మత్తులు చేయించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రియాంకకు డిపిఓ ఆదేశించారు. రోడ్డు నిర్మాణం తో పాటు డ్రైనేజీ నిర్మిస్తామని తెలిపారు. అలాగే వీధిలైట్లు ఏర్పాటు చేసి వాన దారుల, కార్మికుల ఇబ్బందులను తొలగిస్తామని డిపిఓ తెలిపారు.



# రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు తూప్రాన్ గీతా విద్యార్థి



**మెదక్ అక్టోబర్ 10 (సిరిన్యూస్) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 కరాటే బాలుర విభాగంలో తూప్రాన్ గీతా స్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎం.అఖిల్ కుమార్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ తెలియజేశారు. సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేటలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. నవంబర్ మొదటి వారంలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి. రామాంజనేయులు,చైర్ పర్సన్ పి ఉష,డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్,నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ ,ఇంచార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్ ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

# అందరికీ న్యాయ సేవలు అందించడమే లక్ష్యం




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర ఆదేశాల ప్రకారం సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడంలో భాగంగా, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డిలోని డీఅడిక్షన్ / రెహబిలిటేషన్ సెంటర్ వద్ద లీగల్ ఎయిడ్ క్లినిక్ ను స్థాపించడం జరిగింది. ఈ సందర్భంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ (సీనియర్ సివిల్ జడ్జి ) బి. సౌజన్య ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇలాంటి లీగల్ ఎయిడ్ క్లినిక్స్ ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తికి న్యాయసేవలను అందించడం మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు మరియు పునరావాసం పొందుతున్న రోగులకు న్యాయసంబంధ సలహాలు, మార్గదర్శకత్వం అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించబడుతుంది. వ్యసనగ్రస్తులు తమ హక్కులను తెలుసుకోవడం, కుటుంబ, ఆస్తి, ఉద్యోగం, గృహహింస మరియు పునరావాసానికి సంబంధించిన చట్టపరమైన సమస్యల పరిష్కారం కోసం ఈ క్లినిక్ ద్వారా సహాయం పొందవచ్చు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ప్రతి శనివారం ఒక ప్యానల్ లాయర్ మరియు ఒక పారా లీగల్ వాలంటీర్ ను డ్యూటీకి నియమించి సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ సేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఆసుపత్రిలోని రోగులు, వారి బంధువులు ఈ క్లినిక్ ద్వారా లభించే న్యాయసలహాలను ఉపయోగించుకోవచ్చు. ఈ కార్యక్రమము లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయ అధికారి నాగనిర్మల గారు, డా.శశాంక్ గారు,ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ ఆర్ఎంఓ బాల స్వామి, అడ్వకేట్ ఎం డి.ఖాలేద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# దమ్ముంటే ప్రజల మధ్యలోకి చర్చకు రండి ?

- బీఆర్ఎస్ నాయకులకు సవాల్
- అందోల్ లో విద్యాసంస్థలు తీసుకువచ్చిన ఘనత మంత్రి దామోదర్ రాజనర్సింహ కదా
- కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులకే డబల్ బెడ్ రూమ్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- దమ్ముంటే ప్రజల్లోకి చర్చ రండి నేను ఒక్కడినే వస్తా
- మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు సవాల్



**అందోలు అక్టోబర్ 10 (సిరిన్యూస్)** :ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందంటే మంత్రి దామోదర్ రాజనర్సింహ పుణ్యం కాదా అని మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు అభివృద్ధి చేసిన ఘనత మా మంత్రి అని అన్నారు, విద్యాశాఖ మంత్రిగా పదవులు చేపట్టినప్పుడు అందోల్ నియోజకవర్గం ఎన్నో విద్యాసంస్థలు తీసుకువచ్చాడు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నుంచి అందోల్ నియోజకవర్గంలో ఆందోల్ గ్రామంలో నర్సింగ్ కాలేజ్, గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ, పాలిటెక్నిక్, 150 పడకల ఆసుపత్రి ఇవన్నీ అభివృద్ధి జరుగుతున్న మీ కంటికి కనబడుట లేదా. మా అభివృద్ధి 6కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణం జరుగుతుంది. అభివృద్ధి అంటే కాంగ్రెస్ ప్రభుత్వమే తప్ప బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కోసం మాట్లాడే బిఆర్ఎస్ నాయకులకు అర్హత లేదని, అవసరమైతే రండి ప్రజల మధ్యలో చర్చకు నేను రెడీ మీరు రెడీ నా అని మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు సవాల్ విసిరారు.

# సంగారెడ్డి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన శిబిరం




**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంగారెడ్డి చైర్మన్ జి.భవానీ చంద్ర ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.సౌజన్య, సబిత, విబిన్న ప్రతిభావంతుల పాఠశాల, సంగారెడ్డిలో న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, మానసిక ఒత్తిడి నియంత్రణ పద్ధతులు, సానుకూల దృక్పథం, మరియు చట్టపరమైన రక్షణల గురించి వివరించారు. మానసిక ఆరోగ్యం ప్రతి మనిషి సమగ్ర అభివృద్ధికి పునాది అని, ముఖ్యంగా విద్యార్థులలో ఒత్తిడి నిర్వహణ, ఆత్మవిశ్వాసం పెంపుదల, సహనం వంటి అంశాలు అత్యంత అవసరమని సూచించారు. అలాగే మానసిక ఆరోగ్యం శరీర ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమైనది అని హితవు పలికారు. ఆత్మహత్య నిరోధక చట్టాలు, మానసిక సమస్యలపై ప్రభుత్వ సహాయక హెల్ప్‌లైన్‌లు, అవగాహన కేంద్రాల గురించి కూడా వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మానసిక ఆరోగ్యంపై చైతన్యం పెంచడంలో సమాజంలో సానుకూల ఆలోచనల పునరుద్ధరణలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యాపారస్థులు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన కఠిన చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ ఏ రవీందర్

**అందోల్ అక్టోబర్ 10 (సిరిన్యూస్) :** అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వ్యాపారస్తులు సింగల్ యూస్ ప్లాస్టిక్ వాడటం పై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు తిరిగి ఉపయోగించలేని ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిలువ చేయడం లేదా అమ్మడం నిషేధం అని మున్సిపల్ సిబ్బంది వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ప్రజలు, వ్యాపారస్తులు ప్లాస్టిక్ వినియోగించకూడదని ఆదేశాలు జారీ చేస్తూ వ్యాపారస్తులకు అవగాహన తెలుపుతున్నారు. ఎవరైనా వ్యాపారస్తులు సప్ వినియోగిస్తే వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని , యజమానులకు జరిమానా విధిస్తూ లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని వ్యాపారస్తులకు మున్సిపల్ సిబ్బంది తెలియజేశారు . ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# రహదారి విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం ఇవ్వండి



- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** సంగారెడ్డిమదీనాగూడ జాతీయ రహదారీ విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న కంది గ్రామ నిర్వాసితులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదు..ఉంటే సీఎంతో మాట్లాడే వాణ్ణి, ఇది ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ఎంపీల పరిధిలో ఉంది, మీరు నా దగ్గరికి వచ్చారు కాబట్టి నేషనల్ హైవే అధికారులను మీ దగ్గరికి తీసుకొని వచ్చాను. 1956లో ల్యాండ్ యాక్ట్ వచ్చింది.. అంతకు ముందు నుండే ఇక్కడ ఇండ్లు, స్థలాలు ఉన్నాయి. వంద ఏళ్ల క్రితం నుండే కంది గ్రామంలో రోడ్డుకి ఇరువైపుల పొజిషన్లో ఉన్నారు. వారికి మంచి పరిహారం ఇవ్వాలని నేషనల్ హైవే అధికారులకు,జగ్గారెడ్డి సూచించారు. ఈ సందర్భంగా కంది గ్రామస్తులకు నష్టపరిహారం విషయం పై, వారికి అనుకులంగా, మానవతా దృక్పథంతో వ్యవహరించి న్యాయం చేయాలని మీడియా ద్వారా కలెక్టర్ ని కోరారు.






# పోలీస్ స్టేషన్ ముందు బాధితులు

- పరారీలో విద్య
- 9 మంది పై కేసు నమోదు చేసిన పోలీసులు

**పటాన్ చెరు, అక్టోబర్,10, (సిరి న్యూస్) :** 18 కోట్ల రూపాయల కు పైగా వసూల్ చేసి అడగడానికి వచ్చిన వారి పై దాడులకు పాల్పడిన కిలాడి లేడీ విద్య పరారీ లో ఉంది. బాధితులు మాత్రం తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్ ముందు పడిగాపులు పడుతున్నారు. శుక్రవారం నాడు రోజంతా వారు స్టేషన్ ముందు కనిపించారు. నిన్న బాధితులు పోలీసుల ను ఆశ్రయించిన విషయం తెలుసుకుని విద్య రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయింది. ఉదయం పటాన్ చెరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వినాయక రెడ్డి తన సిబ్బంది తో ఏ పీ ఆర్ గ్రాండ్ కాలనీ కీ చేరుకుని ఆమె ఇంటికి వెళ్ళారు. తాళం వేసి ఉన్న విషయం గమనించి ఇరుగు పొరుగు వారిని విచారించి వచ్చారు. ఇదిలా ఉంటే దాడిలో గాయపడిన కలమ్మ ఈ రోజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె కూడా తన చేతి కి పట్టి వేసుకుని పోలీస్ స్టేషన్ ముందే వేచి ఉన్నారు. ఈ కేసులో దాడి చేసిన 9 మంది పై కేసులు నమోదు చేసినట్లు సి ఐ వినాయక రెడ్డి తెలిపారు. డబ్బుల విషయంలో ఇది వాటికే కూకట్ పల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని చెప్పారు. త్వరలోనే నిందితురాలు ను పట్టుకుంటామని ఆయన చెప్పారు.

**ఒక్కొక్కరి తో ఒక్కో బాధ**

విద్య బాధితుల ది ఒక్కొక్కరి ది ఒక్కో దీన గాథ వినిపిస్తోంది. కలమ్మ తన కూతురు పెళ్లి కోసం ఉంచుకున్న దాదాపు కోటి రూపాయలు అధిక వడ్డీ కి ఆశపడి విద్య కు ఇచ్చారు. ఈ రెండు మూడు నెలల్లో ఆమె పెళ్లి పెట్టుకోవాల్సి ఉంది. ఉమా దేవి అనే మహిళ 1.80 కోట్లు ఇచ్చింది. సుమ అనే మహిళ 20 తులాల బంగారం అందజేసింది. వెన్నెల, సౌమ్య లు ఇద్దరూ కలిసి 1.80 కోట్లు ఇచ్చారు. 9 వ తేదీ అందరికీ మీ మీ డబ్బులు ఇస్తాం రమ్మని చెప్పడం తో అందరూ కలిసి రెండు వాహనాలు అద్దెకు తీసుకుని నిన్న పటాన్ చెరు కు ఆమె ఉన్న ఇంటికి చేరుకున్నారు. అందరూ ఇంట్లోకి వచ్చిన తర్వాత తలుపులు మూసి లోపల ఉన్న



తన మనుషుల తో దాడుల కు పాల్పడింది. బాధితులు వెంటనే 100 కి ఫోన్ చేశారని సి ఐ వినాయక రెడ్డి తెలిపారు. ఈ ఫోన్ కాల్ తో తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారన్నారు.



# మూలమలుపులతో ప్రమాదాలు



**ఆందోల్ అక్టోబర్ 10 (సిరిన్యూస్):** ఆర్ అండ్ బి నిర్లక్షపు మత్తులో నిద్రిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్న వైనం ఇది. నాందేడ్ అకోలా జాతీయ రహదారి 161లో గల రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలసి మృతి గుహరాలు మారాయి. సంగారెడి జిల్లా అందోల్ మండల పరిధిలో అన్నసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో చెరువుకట్టపై మూల మలుపులో ప్రమాదాలు జరిగే ప్రాణాలు పోతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సూచించే సూచిక బోర్డులు కనబడుటలేదు . రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్క లు వేపుగా పెరిగి దారిని కప్పేస్తున్నాయి. దీనితో రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇకనైనా రోడ్డు భవన శాఖ అధికారులు నిర్లక్షకు నిధులను వీడి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను

- ప్రాణాలు పోయినా పట్టించుకోరా
- నిద్ర మత్తులో ఆర్ అండ్ బి అధికారులు

తొలగించాలని వాహన దారులు, ప్రజలు యువజన సంఘాలు నాయకులు కోరుతున్నారు.



# సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జేఎన్‌టీయూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమంను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. మాదక ద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తుకు అడ్డంకిగా మారకూడదని, తల్లిదండ్రులు మీ పై పెట్టికున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా భవిష్యత్తు నిర్మాణంలో దృష్టి సారించాలని ఎస్పీ అన్నారు. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మోసపూరిత లింకులు, కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాధ్యతగా గల పౌరులుగా ట్రాఫిక్ నిబంధులను పాటిస్తూ విధిగా హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపునిచ్చారు.

# కోటి 50 లక్షల నిధులతో జంక్షన్ల అభివృద్ధి



- **పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**అమీన్ పూర్, అక్టోబర్ 10, (సిరిన్యూస్) :** అమీన్పూర్ మునిసిపల్ పరిధిలోని బీరంగూడ నుండి కిష్టారెడ్డిపేట ఔటర్ రింగ్ రోడ్డు వరకు 68 కోట్ల రూపాయలతో చేపట్టిన 100 ఫీట్ల రహదారి విస్తరించారు, దీనిలో భాగంగ మండే మార్కెట్ జంక్షన్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్ గూడ డబుల్ బెడ్ రూమ్ జంక్షన్లను ఒక కోటి 50 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు, రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి కూడళ్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ - కిష్టారెడ్డిపేట రహదారి పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా గత ప్రభుత్వ హయాంలో బీరంగూడ కిష్టారెడ్డిపేట రహదారి విస్తరణ కోసం 68 కోట్ల రూపాయల కేటాయించి.. 100 ఫీట్ల రహదారిగ విస్తరించడం జరిగిందని తెలిపారు. రహదారి పరిధిలోని మండే మార్కెట్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్ గూడ డబుల్ బెడ్ రూమ్ జంక్షన్ల అభివృద్ధికి ఒక కోటి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ జంక్షన్ లో శివాజీ విగ్రహం, పటేల్ గూడా డబుల్ బెడ్ రూమ్ జంక్షన్ లో మహాత్మా గాంధీ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సింఫనీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, తహసిల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం డి ఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ సీనియర్ నాయకులు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **ప్రభుత్వ పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాలు, ఈఎస్ఐ ఆసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ**

**అమీన్ పూర్, అక్టోబర్ 10 (సిరిన్యూస్) :** తెల్లాపూర్ మునిసిపాలిటీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాల చిన్నారుల కోసం రెండు వాటర్ ప్యూరిఫైయిర్లను రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు లవణ్ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్,పాఠశాల సిబ్బందికి అందించారు. తదనంతరం ఈఎస్ఐ



ఆసుపత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు, సందర్భంగ వారు మాట్లాడుతూ.. తెల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలకే కాకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సామాజిక కార్యక్రమాలతో రెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్తానిక నాయకులు గోపాల్ రెడ్డి, యం. సురేశ్, అరుణ్ గౌడ్, బి.మురళి, రవీందర్ రెడ్డి,హరీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..



# విజ్ఞాన్ మోడల్ పాఠశాలలో కరాటే పోటీలు




**సదాశివపేట. అక్టోబర్ 10. (సిరి న్యూస్)** సదాశివపేట విజ్ఞాన్ మోడల్ పాఠశాలలో 29వ ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్ జి ఎఫ్ కరాటే పోటీలు నిర్వహించడం జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 17 విభాగంలో కరాటే పోటీలు ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పోటీలకు నిర్వాహకులుగా పిడి సతీష్ గౌడ్ నిర్వహించగా, ఈ పోటీలకు అబ్జర్వ్ లు గా పీడీలు రాజశేఖర్ అమృత్ చందర్ ప్రశాంత్ గౌడ్ నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లాల నుండి సుమారు 250 మంది బాలబాలికలు కరాటే పోటీలలో పాల్గొనడం జరిగింది. ఈ పోటీలకు రిఫరల్ గా ఇంటర్నేషనల్ రిఫర్ సి చందర్ మోహర్, సంగారెడ్డి కె. శంకర్ గౌడ్ మాస్టర్ సదాశివపేట, మెదక్ కు చెందిన నాగేష్  ఈ పోటీలకు జడ్జిగా మహేష్ దత్తాత్రేయ చారి, దినకర్, మల్లేశం, రంజిత్, సిద్దు, స్వామి, సమీర్, భాగ్యరాజ్ నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మొదటి స్తానం సాధించిన విద్యార్ధిని విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుండి 24 మంది పాల్గొనడం జరుగుతుంది.

# కోర్టు స్టేకు నిరసనగా సంగారెడ్డి పట్టణంలో బీసీల ధర్నా



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 10 (సిరి న్యూస్) :** బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాషా ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో, స్థానిక ఎన్నికల పై కోర్టు స్టేకు నిరసనగా సంగారెడ్డి పట్టణంలో బీసీల ధర్నా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య మరి అలాగే రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ ఆదేశాల మేరకు ధర్నాను బీసీ నాయకుల నినాదాలతో దద్దరిల్లిన సంగారెడ్డి పట్టణం, బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవడం హైకోర్టు స్టే ఇవ్వడం అగ్రవర్ణాల కుట్రలో భాగమే అని అన్నారు. రాజ్యం అగ్రవర్ణాల చేతిలో ఉన్నంత కాలం బహుజనులు బానిసలే అని, అన్ని రాజకీయ పార్టీలు బీసీలను స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నా బీసీ ద్రోహులర కబర్దర్ అని అన్నారు. బిజెపి మిగతా పార్టీలు ఎందుకు ఇంప్లిఎడ్ కాలేదు. కోర్టులో పిటిషన్ వేయకుండా మాధవరెడ్డిని అడ్డుకునే శక్తి రేవంత్ రెడ్డి కు లేదా అని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సాయిబాషా డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీసీ విద్యార్థి సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, కాసినిమణి, ఆశిష్ గౌడ్, శ్యామ్, మనోజ్, విజయ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం ప్రారంభం




**పటాన్ చెరు, అక్టోబర్,10, (సిరి న్యూస్) :**ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట, హైదరాబాద్ జాతీయ సేవా పథకం చైర్మన్ ప్రొఫెసర్ కె.పద్మావతి, యూనిట్ -1 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీ.నరసింహులు, యూనిట్-3 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.మధుకర్ రావుల ఆధ్వర్యంలో 7 రోజుల ఎన్ఎస్ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం పటాన్ చెరు మండలం ఐనోల్, పెద్దకంజర్ల గ్రామాలలో రెండవ రోజు శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఐనోల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో యోగాసనాలతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కార్యక్రమాలను ప్రారంభించారు. ఐనోల్, పెద్దకంజర్ల గ్రామాలలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని వీధి వీధినా తిరుగుతూ ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రజాస్వామ్యాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని సూచించారు. నిజాయితీగా ఎన్నుకొని ప్రజాస్వామ్యాన్ని  పటిష్టం చేయాలని ప్రచారం చేశారు. అదే విధంగా పెద్దకంజర్ల వార్డు కార్యాలయం ఆవరణలో కలుపు మొక్కలు తొలగించి పరిశుభ్రము చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారిని అనిత పాల్గొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించారు.